'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

యోధుడు మళ్లీ యుద్ధంలోకి..

కేసీఆర్‌కు యుద్ధం కొత్త కాదు. తెలంగాణ వస్తదా.. రానిస్తరా అనే సందేహాలను పటాపంచలు చేసి అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపిన యోధుడు. ఆయన మాటల్లోనే చెప్పాలంటే తెలంగాణ కోసం ఆయన ఎక్కని కొండ లేదు, మొక్కని బండ లేదు. వ్యూహ కుశలత, యుద్ధ చతురత తనలో పుష్కలంగా ఉన్నాయి. అందుకే తెలంగాణ నిలిచింది, గెలిచింది. ఇప్పుడు తెలంగాణ మళ్లీ కష్టాలపాలైంది. ఒక్క మాటలో చెప్పాలంటే మళ్లీ చౌరస్తాలో నిలబడింది. కథ మళ్లీ మొదటికి వచ్చింది. తెలంగాణ శత్రువులు చెలరేగిపోతున్నారు. అందుకే ఆయన రంగంలోకి దిగి సమరశంఖం పూరించారు. బుగులు పడుతున్న తెలంగాణ భుజం తట్టారు. నల్గొండ, కరీంనగర్ సభల్లో రైతు సమస్యలపై ధ్వజమెత్తారు. చేవెళ్ల, జహీరాబాద్ సభల్లో రాజకీయ ప్రత్యర్థులను ఎండగట్టారు. త్వరలో బస్సు యాత్రలు చేపడుతానంటూ సమరోత్సాహం చాటుతున్నారు. వయసు తనకు అడ్డంకి కాదని, అనారోగ్యాలు, కేసులు, కుటుంబ వేధింపులు తనను ఆపలేవని ఎలుగెత్తి చాటుకున్నారు. సోషల్ మీడియా దాడులూ తనను అడ్డుకోలేవని గర్జించారు. బట్టకాల్చి మీదేసేటోళ్లే బండారం బద్దలు కొడుతున్నారు. నాలుగు లేనిపోని విమర్శలు విసిరి చంకలు గుద్దుకునేవాడు నాయకుడు కాదు. ప్రజాబలంతో పోరాడేవాడు అసలు సిసలు నాయకుడని కేసీఆర్ ఆచరణలో ఢంకా నిరూపిస్తున్నారు.

తను బక్కపల్చటి మనిషి. కానీ, తనది ఉక్కుసంకల్పం. తనది దేహబలం కాదు. ప్రజాబలం. ఆ ప్రజాబలం అండదండలతోనే తెలంగాణ సాధించారు. గడ్డిపోచలను ఉక్కు ఊచలుగా మలచిన ఉక్కు సంకల్పం తనది. చిత్తశుద్ధితో కూడిన న్యాయమైన పోరాటం తనది. ప్రగతి పరుగులతో తెలంగాణ కీర్తికాంతులను దశదిశలా వ్యాపింపజేశారు. రెండు దశాబ్దాల పైచిలుకు కాలంలో ఆయన ఎదుర్కున్నట్టి కుట్రలు, కుతంత్రాలు, వెన్నుపోట్లు, విషపుకాట్లు మరే ఇతర నాయకుడూ ఎదుర్కోలేదు. తనలా తట్టుకుని నిలబడనూ లేదు. అవరోధాలు చూసి భయపడితే తను కేసీఆర్ ఎందుకవుతారు?! ఎవరి వల్లా కాని తెలంగాణను ఎలా సాధిస్తారు? నిజానికి ఇప్పుడు జరుగుతున్న దాడులకన్నా ఉద్యమకాలంలో వెయ్యిరెట్ల దాడులను ఎదుర్కొన్న అనుభవం తనకున్నది. తన మీద వెయ్యని నిందలేదు. చెయ్యని విమర్శ లేదు. అయినా ఆయన తన దృష్టి మరల్చలేదు. ఎత్తిన ఆయుధాన్ని దించలేదు. తెలంగాణ వేదనలను తన భుజాలపైన మోసిన చరిత్ర తనది. అయినా ఏ నాడూ తను జంకనూలేదు, వెనుకడుగు వెయ్యనూ లేదు. ప్రత్యర్థుల ఎత్తుగడలు, పన్నాగాలు ఆయన దీక్షాదక్షతల ముందు చిత్తయి కుప్పకూలిన దృశ్యాలు మన కండ్లముందు ఇంకా సజీవంగా కదలాడుతూనే ఉన్నాయి. తనను పడగొట్ట బూనిన ప్రత్యర్థులను తిరగబడి విరగబోట్లు పొడిచిన ఉదంతాలు చరిత్రలో కోకొల్లలు. తాత్కాలిక రాజకీయ లబ్ధి కోసం ఆయన ఎన్నడూ పని చేయలేదు. ఏది చేసినా ప్రజల మేలు కోసమే. ఇప్పుడాయన మరోసారి ప్రజాక్షేత్రంలోకి దిగి సమరశంఖం పూరించడంతో రాజకీయ ప్రత్యర్థుల గుండెల్లో దడ పుడుతున్నది.

అబద్ధం తొందరగా వ్యాప్తి చెందవచ్చు. కానీ నిజం నిలకడ మీద తెలుస్తుంది. కాంగ్రెస్ ఎన్ని కల్లబొల్లి కబుర్లు చెప్పి అధికారంలోకి వస్తేనేం.. వందరోజుల్లోనే వారి సత్తా తేటతెల్లమైంది. నాలుగు నెలల్లోనే తెలంగాణ తెర్లు తెర్లు అయ్యింది. నీటి కష్టాలైతేనేం, కరెంటు కోతలైతేనేం, పూర్తికాని రుణమాఫీ అయితేనేం, అందని రైతుబంధు అయితేనేం, పెరగని పింఛన్లు అయితేనేం, గోడెక్కని ఉద్యోగాల క్యాలెండర్ అయితేనేం.. అసలు సిసలు కాంగ్రెస్ నైజం ప్రజలకు దృగ్గోచరమైంది. కల చెదిరింది. కథ మారింది. పదేండ్ల నాటి కరువు రక్కసి కర్కశ కౌగిలిలో ప్రజలకు ఊపిరి సలపడం లేదు. పొరపాట్లు చేసి అగచాట్లు పడుతున్నామని కుములుతున్న ప్రజలకు కేసీఆర్ గుండెదిటవు కలిగిస్తున్నారు. రాబోయే రోజుల్లో దిద్దుబాట్ల దిశగా అడుగులు పడాలని ఆత్మీయ ఓదార్పు అందిస్తున్నారు. ఈ కష్టకాలంలో ప్రజలకు ధైర్యం చెప్పేందుకు కేసీఆర్ రంగంలోకి దిగుతున్నారు అనగానే ప్రత్యర్థుల్లో వణుకు బయలుదేరింది. ఆయన సభలకు వస్తున్న జనశ్రేణులను చూస్తుంటే వారికి కండ్లు బైర్లు కమ్ముతున్నాయి. వారి మాట తీరు మారడమే అందుకు సాక్ష్యం. సీఎం రేవంత్ నోట సానుభూతి ఆట మాటలై వెలువడుతున్నాయంటేనే వాళ్లు ఆత్మరక్షణలో పడ్డారనే అర్థం. కేసీఆర్ నుంచి ప్రజలను ఎక్కువకాలం దూరం చేయలేరు! ఇది సత్యం.

పల్లె మళ్లీ కన్నీరు పెడుతున్నది

ఉమ్మడి పాలనలో తెలంగాణ ప్రాంతం గోసపడ్డది, కంట కన్నీరు పెట్టింది. అందుకే గోరటి వెంకన్న 'పల్లే కన్నీరు పెడుతుందో కనిపించని కుట్రల.. నా తల్లి బంధీ అయిపోతుందో కనిపించని కుట్రల..' అంటూ పాట రాశారు. ఆవిర్భావం తర్వాత పదేండ్ల పాటు పచ్చగా కళకళలాడిన తెలంగాణను ఇప్పుడు మళ్లీ కరువు రక్కసి ఆవరించింది. ఫలితం మళ్లీ పరాయి పాలన నాటి పరిస్థితే రాష్ట్రంలో నెలకొన్నది. రాష్ట్రంలోని ప్రతి పల్లె ఇప్పుడు మళ్లీ కన్నీరు పెడుతున్నది. తెలంగాణలోని మడుగులన్నీ అడుగంటిపోయినవి. బావులు సావుకు దగ్గరైనవి. వాగులు, వంకలు ఎండిపోయినవి. కుంటలన్నీ నెర్రెలు బారినవి. ఉమ్మడి పాలనలో తెలంగాణ ఎంత ధ్వంసమైందో, అచ్చం అలాంటి పరిస్థితులే ఇప్పుడు రాష్ట్రంలో మళ్లీ దాపురించడం నిజంగా బాధాకరం.

చిటుకుల మైసారెడ్డి
94905 24724

నాటి పల్లె కన్నీరు తుడిచేందుకు, పట్నం బాధలు తీర్చేందుకు, నీళ్ళు, నిధులు, నియామకాలు సాధించేందుకు సిద్ధపడిన ఒకే ఒక్కడు కేసీఆర్. ప్రత్యేక రాష్ట్రం కోసం గులాబీ జెండా ఎగుర వేసి కోట్లాది గొంతుకై తెలంగాణ ఆత్మ గౌరవ, అస్తిత్వ విజయంతో తెలంగాణను సాధించారు. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ తెలంగాణ పాలనా రథాన్ని ముందుకు నడిపారు. అంధకారం అలముకున్న తెలంగాణను కరెంట్ కష్టాలు లేకుండా వెలుగు సూర్యుడిలా ఉదయించేలా చేశారు. మూడేండ్లలోనే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి తెలంగాణ మాగాణికి జలధార అయ్యారు. దీంతో మన తెలంగాణ పచ్చని పంటలతో ధాన్యపు రాశులు, సిరులు కురిపించే బంగారమైంది. దేశానికి ఆదర్శంగా టన్నుల కొద్దీ ధాన్యం పండించిన రాష్ట్రంగా ఎదిగింది. తెలంగాణ బిడ్డల కోసం ఉద్యోగ నియామకాలను చేపట్టింది. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలుచేసి తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచారు కేసీఆర్. ఆయన హయాంలో ప్రాజెక్టుల నుంచి ఎగిసిపడ్డ గంగమ్మ తల్లిని చూశాం. శివుడు నెత్తి మీద ఉన్న గంగమ్మ నేల తల్లి తెలంగాణను హత్తుకుని తడిసి ముద్దయింది. పచ్చని పంటలతో కళకళలాడిన తెలంగాణ నేడు నాలుగు నెలల కాంగ్రెస్ హయాంలో మళ్లీ కరువు కన్నీళ్లు తెప్పిస్తున్నది.

కేసీఆర్ తెచ్చిన తెలంగాణ సకల జనుల సంతోషాన్ని జీర్ణించుకోలేని కాంగ్రెస్, బీజేపీలు తెలంగాణ అస్తిత్వ ఉద్యమ ఆత్మ గౌరవాన్ని నిలిపిన కేసీఆర్‌పై, బీఆర్ఎస్ పార్టీపై ఓర్వలేని తనంతో నీలాపనిందలు, అబద్ధాలు ప్రచారం చేశాయి. అరవై ఏండ్లు దోచుకున్నది చాలదన్నట్లు మళ్ళీ అధికారం పొందేందుకు అలవికాని హామీలతో తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ మోసం చేసింది. ఏనాడూ 'జై తెలంగాణ' అని పలకని రైపిల్ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో నేడు తెలంగాణ కన్నీళ్లు, కష్టాలు, ఆత్మహత్యలతో తల్లడిల్లిపోతుంది.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే అరవై ఏండ్ల కష్టాలు తన్నుకువస్తున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి అసమర్థత వల్ల తెలంగాణ కరువు కోరల్లో చిక్కుకున్నది. అక్టోబర్ వరకు నీళ్లతో నిండిన తెలంగాణ నాలుగైదు నెలల్లోనే బీడుగా మారింది. ఫలితంగా రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యల పరంపర కొనసాగుతూనే ఉన్నది. జలాశయాల్లో నీళ్లున్నా ప్రభుత్వం పంటలకు నీళ్లివ్వడం లేదు. రైతులు చనిపోతున్నా సర్కార్ కనికరించడం లేదు. కేసీఆర్‌పై కక్షసాధింపు చర్యల కోసం కర్షకుల కడుపు కొట్టడం ఈ ప్రభుత్వానికి సరికాదు. 'అసెంబ్లీ ఎన్నికలో నెగ్గినం, ఇక పార్లమెంట్ ఎన్నికలే మిగిలాయి' అన్న నినాదాన్ని కాంగ్రెస్ నేతలు తరచూ వాడుతున్నారు. అందుకే రాష్ట్రంలో పాలన అటకెక్కింది. ఢిల్లీకి కప్పం కట్టి సీఎం సీటు పదిలం చేసుకోవాలని తాపత్రయ పడుతున్నారు. అందుకే ఈ పొలిటికల్ డ్రామాలు, బ్లాక్‌మెయిల్ రాజకీయాలు. అంతే తప్ప తెలంగాణ రాష్ట్రంలో ఏం జరుగుతుందో తనకేం అవసరం లేదన్నట్టుగా రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు.

తినడానికి తిండి గింజలు కరువైనయి. పశువులకూ మేత దొరకని పరిస్థితి ఉన్నది. పంట పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులు కట్టలేని స్థితి. మళ్లీ వాన కాలం దగ్గరికి రావట్టే. కాలం ఎట్లుంటదో. నీళ్లు వస్తయో, రావోనన్న ఆందోళన రైతుల్లో మొదలైంది. రాష్ట్రం కరువు కోరల్లో చిక్కుకున్నది. సాగుకే కాదు, తాగడానికి నీళ్లు దొరకని పరిస్థితులు నెలకొన్నాయి. నేడు తెలంగాణ మొత్తం ఎడారిని తలపిస్తున్నది. భూగర్భ జలాలు అడుగంటి పాతాళలోకి పోయినయి. అందుకే తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ చూసినా 'కాంగ్రెస్‌కు ఓటేసి మోసం పోయినం' అనే మాటనే ఇనవడ్తున్నది.

'కేసీఆర్ ఉన్నపుడు బాగుండేది. పంటలకు నీళ్ల సౌలత్, రైతు బంధు, రైతు భీమా, మద్దతు ధర, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొని ట్రైంకు డబ్బు తమ బ్యాంక్ ఖాతాలో జమ చేశారు. ప్రతి నెల పింఛన్లు, కల్యాణ లక్ష్మి, కేసీఆర్ కిట్, బీడీ కార్మికులకు భృతి క్రమం తప్పకుండా కేసీఆర్ సార్ ఇస్తుండె. మంచి సార్‌ను దూరం చేసుకుని బాధ పడుతున్నము. మళ్ళీ కేసీఆర్ సార్ రావాలి' అని తెలంగాణ ప్రజానీకం పల్లెల్లో చర్చ చేస్తున్నరు. ఢిల్లీలో తెలంగాణ కోసం కొట్లాడాలంటే కేసీఆర్‌ను, బీఆర్ఎస్ పార్టీని గెలిపించుకోవాలన్న నిర్ణయానికి వచ్చారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెర వేరాలన్నా పార్లమెంట్ ఎన్నికల్లో కేసీఆర్‌కు అండగా ఉండాలి. కష్ట కాలంలో రైతుల కన్నీళ్లు తుడవటానికి, నేనున్నా మీకు అంటూ రైతన్నలకు కేసీఆర్ భరోసా ఇస్తున్నారు. అందుకే ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని శిఖరాగ్రాన నిలిపి భవిష్యత్ తెలంగాణకు కొత్త వసంతం తేవాలి. కేసీఆర్‌కు అండగా నిలుద్దాం. తెలంగాణను కాపాడుకుందాం. రైతు కన్నీళ్లను తుడుద్దాం.



బీజేపీ గెలుపును కోరుతున్న కాంగ్రెస్

పదైనా సమస్యను లేవనెత్తినప్పుడు బీజేపీ భాషలోనే కాంగ్రెస్ కూడా మాట్లాడుతుంది. పార్టీ వ్యవస్థలో మార్పులు చేయాలని గతంలో 23 మంది సీనియర్ నాయకులు అభిప్రాయానికి వ్యతిరేకంగా గళం వినిపించినా.. కాంగ్రెస్ నాయకత్వం పట్టించుకోలేదు. బీజేపీతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకుందా? అని కొన్ని సార్లు సందేహం కలుగుతుంది. బీజేపీని గెలిపించాలని కాంగ్రెస్ నేతలే కోరుకుంటున్నారని నాకు అనిపిస్తుంది.

- గులాం నబీ ఆజాద్, డీపీఏపీ అధ్యక్షుడు

నారాజ్

మరపో వెరపో ఉదాసీనతో
నిర్లక్ష్యమో నానిన నోటినుంచి రాలిన మంత్రాక్షరాలనో
తెలంగాణ పేరు మూలకుపడ్డది

నిండైన చెరువులో కొట్టి కొట్టి, అలసి, నిద్రకమ్ము కొచ్చింత ఈత
అడుగు బొడుగు రాళ్లు తేలి వెక్కిరిస్తున్నయి
రైతు భుజాన నాగలి
మళ్లీ జీసస్ చరమాంకం గుర్తుకు తెస్తున్నది
కాకతీయ కళాతోరణం కళ
నాలుక మీది మాటలా మెలిక పడ్డది
గోల్కొండ కోట మువ్వన్నెల ధీరత్వం వొదిలి
జీకు పిట్టల వశమైనది
మల్లినాథుని నుడుగుల పల్లీయత
తిట్ల రోతలో కుములుతున్నది

పునఃనిర్మాణ వైభవం శ్వేతపత్రంలో
నల్లమొగంతో తెల్లబోయింది
మూసీ తెల్లపండ్ల నవ్వుల కోసం
అమ్మ పరువు కాళ్ల బేరమయ్యింది
కంచెల్లేని పైరవీ స్వైరవిహారంలో
వినతుల వెతల విన్నపా లెవరికి?

నమూనాలన్ని ఎడమచేతి రాతకు గురౌతున్నయి
కాళేశ్వరం రోగగ్రస్థ శాపగ్రస్థ అని ముద్ర వేయించుకున్నది
ఖజానా ఉచితాల కర్రకాళ్లతో నిలదొక్కుకోలేక చతికిల పడింది

గత దశమం ఉత్తదేనా?
అయోమయ ఇంద్రజాలమేనా?
కలలోనే నడిచినమా?

(మహాధిప మనోగతం, అసామాన్య ప్రజాక్షేత్రం
పెను సంఘర్షణా పరిణామ ఉప్పెనా విభ్రమ ఫలమా?)
మౌన ఋషిత్వ అంతర్ముఖీన విచికిత్సలో
సత్యజ్ఞాన ప్రకాశ మహోదయం సంభవించేనా!)

మూడున్నర కోట్ల నిగళాల ముక్తగానం,
పైశాచీ ఆనందాల రాజకీయం
వికృత క్రీడల విముక్త తెలంగాణ
ఎప్పుడు తల్లీ! ఓ కంజాతవల్లీ!

మనస్విని

గత హామీల మాటేమిటి మోదీ?

భరత్ చౌహాన్

దేశ అభివృద్ధి, శ్రేయస్సు, యువత, మహిళలు, పేదలు, రైతులే ప్రధాన అజెండాగా బీజేపీ తన నూతన ఎన్నికల మ్యానిఫెస్టో 'సంకల్ప పత్రం.. మోదీ గ్యారెంటీ'ని ఇటీవల విడుదల చేసింది. వికసిత భారతే తమ లక్ష్యమని పేర్కొన్నది. కానీ, 2014లో కూడా బీజేపీ ఇలాంటి వాగ్దానాలతోనే నమ్మబలికి అధికారంలోకి వచ్చింది. అప్పుడు ప్రకటించిన మ్యానిఫెస్టోలోని ఎన్ని హామీలు నెరవేర్చారు? అన్నది నూతన మ్యానిఫెస్టోలో ఎక్కడా ప్రస్తావించలేదు. 90 శాతం హామీలను అమలు చేశామని ఒక్కముక్కలో తేల్చేశారు. వెయ్యేండ్ల అభివృద్ధికి సరిపడా ఎజెండాతో నూతన మ్యానిఫెస్టో తయారు చేశామని మోదీ మరోసారి గప్పాలు కొడుతున్నారు.

బీజేపీ 2014లో ఇచ్చిన హామీలు ఎంతమేరకు అమలు చేసిందో? గడిచిన పదేండ్ల పాలనలో మోదీ సర్కార్ సాధించిన ప్రగతి ఎంత అనేది గణాంకాలతో సహా గమనిస్తే అసలు కథ అర్థమవుతుంది. యువతకు ఉపాధి కల్పించడంలో గత కాంగ్రెస్ పాలకులు ఘోరంగా విఫలమయ్యారని, తాము అధికారంలోకి వస్తే ఏటా 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని యువతను నమ్మించి నరేంద్ర మోదీ 2014లో అధికారంలోకి వచ్చారు. ఈ లెక్కన గడిచిన పదేండ్లలో ఏడాదికి 2 కోట్ల చొప్పున మొత్తం 20 కోట్ల ఉద్యోగాలు కాదు కదా కనీసం 2 కోట్ల ఉద్యోగాలు కూడా కల్పించలేకపోయింది మోదీ ప్రభుత్వం. గడిచిన 40 ఏండ్లలో ఎన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో దేశంలో నిరుద్యోగం పెరిగిపోయింది. ప్రస్తుతం గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన యువతీయువకుల్లో 45 శాతం మంది నిరుద్యోగులే. ఇదీ మోదీ సాధించిన ప్రగతి.

అదేవిధంగా నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయని, తాము అధికారంలోకి రాగానే ధరలు తగ్గిస్తామని వాగ్దానం చేశారు. కానీ, ధరలను ఏవిధంగా, ఎంతమేరకు తగ్గించి సామాన్యుడికి అందుబాటులోకి తెచ్చారో మ్యానిఫెస్టోలో ఎక్కడా ప్రస్తావించలేదు. 2014-2024 వరకు కన్సూమర్ ఇండెక్స్ ప్రైస్ గణాంకాలను పరిశీలిస్తే.. గత పదేండ్లలో ధరలు తగ్గడం అటుంచి 70 శాతానికి పైగా పెరిగినట్టు తెలుస్తున్నది. అదేవిధంగా 2014లో రూ.300 ఉన్న సిలిండర్ ధర నాలుగు రెట్లు పెరిగి రూ.1150కి చేరింది. అప్పట్లో లీటర్ డీజిల్ రూ.55, పెట్రోల్ రూ.66 ఉండేవి. అవి ప్రస్తుతం సెంచరీకి

చేరుకున్నాయి. ప్రపంచవ్యాప్తంగా చూసుకుంటే.. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలలో టర్కీ తర్వాత మన దేశం రెండో స్థానంలో ఉన్నట్లు గ్లోబల్ ఇండెక్స్ రిపోర్ట్ తెలియజేస్తున్నది. దీన్నిబట్టే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

రైతుల ఆదాయం రెండింతలు చేస్తానని చెప్పిన మోదీ దాని గురించి అసలు ప్రస్తావించలేదు. పైగా ఈ పదేండ్లలో 1,00,474 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని అధికారిక లెక్కలు చెప్తున్నాయి. అంటే సగటున రోజుకి 30 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. రైతుల ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచడం పక్కనపెడితే.. రైతులకు వ్యతిరేకంగా మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చి దాదాపు 750 మందికి పైగా అన్నదాతల మృతికి కారణమైంది బీజేపీ సర్కార్. నల్లచట్టాలను వెనక్కి తీసుకుంటున్నామని మోదీ ప్రకటించినప్పుడు పంటకు కనీస మద్దతు ధర దక్కేలా చట్టం చేస్తామని హామీ ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. మద్దతు ధర కోసం మరోసారి రైతన్నలు రోడ్డెక్కి నిరసనలు చేసినా మోదీ సర్కార్ పట్టించుకోవడం లేదు.

నరేంద్రమోదీ పాలనలో రైతుల ఆర్థిక పరిస్థితి రోజురోజుకు దిగజారిపోతున్నది. అదానీ, అంబానీల ఆదాయం మాత్రం రెట్టింపవుతున్నది. విద్యావిధానం సమూలంగా ప్రక్షాళన చేస్తామన్న హామీని అటకెక్కించారు. అదికాకుండా 2014 నుంచి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా లక్షకు పైగా ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయి. ఆయుష్మాన్ భారత్ గురించి గొప్పలు చెప్తున్న బీజేపీ గతేడాది రూ.8 వేల కోట్లు ఆ పథకం కోసం ఖర్చు చేసింది. కేంద్రపాలిత ప్రాంతమైన ఢిల్లీ రూ.9.5 వేల కోట్లను ఆరోగ్య రంగంపై ఖర్చు చేస్తుండటం గమనార్హం.

మోదీ పాలనలో రూపాయి విలువ మరింత క్షీణించింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ రికార్డు స్థాయిలో 82కి పడిపోయింది. మరోవైపు 2014లో రూ.55.87 లక్షల కోట్లుగా ఉన్న దేశ అప్పు ఈ పదేండ్లలో రూ.155.31 లక్షల కోట్లకు పెరిగింది. భారీఎత్తున అప్పులు చేసిన మోదీ సర్కార్ ఏమైనా అభివృద్ధి చేసిందా? అంటే అదీ లేదు. మోసపూరిత వాగ్దానాలు, హామీలతో దేశ ప్రజలను వంచించారు. ఈ పదేండ్ల తిరోగమన పాలన చాలదన్నట్టు.. మళ్లీ వికసిత భారతం అంటూ మాయమాటలతో ప్రజల ముందుకువస్తున్నారు. అలవిగాని హామీల వర్షం కురిపిస్తున్న బీజేపీని నమ్మి మరోసారి మోసపోవద్దు.

ఒక తల్లి కోతి తన బిడ్డను చంకనేసుకొని అడవిమార్గం గుండా పోతున్నది. మార్గమధ్యలో వాటికి ఒక కాలువ అడ్డం వచ్చింది. ఆ కాల్వను దాటేందుకు తల్లి కోతి పిల్ల కోతిని చంకనెత్తుకొని నీటిలోకి దిగింది. పోగా.. పోగా నీళ్లు చంక దగ్గరికి వచ్చాయి. అప్పుడు తల్లి కోతి తన పిల్లను నెత్తిన కూర్చోబెట్టుకొని కాలువ దాటేందుకు ప్రయత్నిస్తున్నది. మధ్యలోకి చేరగానే కోతులు మునిగేంతవరకు నీటి ఊట వచ్చింది. ఇక చేసేదేం లేక తాను బతికి బయటపడాలనుకున్న పెద్ద కోతి తన నెత్తిన ఉన్న పిల్ల కోతిని నీటిలో పడేసింది. దాని మీద నిలబడి ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నది. నీటి ఊట తగ్గగానే బతుకు జీవుడా అంటూ పెద్ద కోతి ప్రాణాలతో బయటపడ్డది. ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన కడియం శ్రీహరి ఉదంతం చూస్తుంటే చిన్నప్పుడు చదివిన ఈ పంచతంత్ర కథ గుర్తుకువచ్చింది. కడియం శ్రీహరి గతంలోకి ఒక్కసారి తొంగి చూస్తే ఈ కథ తనదేనని అనుకోకతప్పదు.

ప్రజలే గుణపాఠం చెప్తారు!

రమేష్‌బాబు కాంచనపల్లి

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నేతృత్వంలో ఉద్యమం ఉధృతంగా జరుగుతున్న రోజులవి. కేసీఆర్ ఎంచుకున్న ప్రధాన పంథా ఉప ఎన్నికలు. అందులో భాగంగానే అధికార పార్టీని కాదనుకొని గులాబీ జెండా ఎత్తుకున్నడు తాటికొండ రాజయ్య. నాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్‌నే కాదు, ఆ పార్టీ నుంచి సంక్రమించిన శాసనసభ్యత్వాన్ని కూడా తృణప్రాయంగా వదులుకున్నారు. తత్ఫలితంగా వరంగల్ జిల్లా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక వచ్చింది. గులాబీ పార్టీ అభ్యర్థిగా తాటికొండ రాజయ్య, టీడీపీ నుంచి కడియం శ్రీహరి, కాంగ్రెస్ తరపున ప్రతాప్ బరిలో నిలిచారు. ఆ ఎన్నికల్లో గులాబీ పార్టీ తరపున ప్రచార బాధ్యతలను నిర్వహిస్తున్న టి.హరీశ్‌రావును దృష్టిలో పెట్టుకుని 'ఎవడో.. సిద్దిపేట నుంచి వచ్చిండట, వాడు నన్ను ఓడిస్తాడట, వాడు నా కాలు గోటి వేలితో సమానం' అంటూ కడియం శ్రీహరి పేట్రేగిపోయారు. అంతే ప్రజలు ఆ ఎన్నికల్లో కడియం శ్రీహరిని మట్టికరిపించారు.

సీన్ కట్ చేస్తే... కేసీఆర్ ఉద్యమంతో కేంద్రం దిగివచ్చింది. 2014 జూన్ 2 నాటికి తెలంగాణ ఏర్పడటంతో కొత్తగా ఏర్పడ్డ తెలంగాణలో అటు లోక్‌సభకు, ఇటు శాసనసభకు ఒకేసారి ఎన్నికలు జరిగాయి. అప్పటికే టీడీపీ అంతరించిపోతున్న సంకేతాలు స్పష్టంగా అర్థమవుతున్నాయి. అంతే.. కడియం శ్రీహరికి తత్వం బోధపడినట్టున్నది. గులాబీ గూటికి చేరారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో గులాబీ పార్టీ తరపున వరంగల్ లోక్‌సభకు పోటీ చేసిన కడియం, స్టేషన్ ఘనపూర్ నుంచి పోటీచేసిన తాటికొండ రాజయ్య ఇద్దరూ విజయం సాధించారు. ఆ తర్వాత కొత్తగా ఏర్పడిన తొలి మంత్రివర్గంలో తెలంగాణ తొలి ఉప ముఖ్యమంత్రిగా తాటికొండ రాజయ్య బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు బాగానే ఉంది. కానీ, ప్రత్యర్థి తాటికొండ రాజయ్య ఉప ముఖ్యమంత్రి కావడాన్ని కడియం శ్రీహరి జీర్ణించుకోలేకపోయారు. ఆ పదవిపై కన్నేసిన కడియం శ్రీహరి.. తాటికొండ రాజయ్యపై అధిష్ఠానానికి తప్పుడు సమాచారం అందించారు. మొత్తమ్మీద తాటికొండ రాజయ్య పదవికి ఎసరు పెట్టడంలో శ్రీహరి విజయం సాధించారు. కానీ, శ్రీహరి నిజస్వరూపం కాంగ్రెస్‌లో చేరేదాకా బయటపడలేదు. కించిత్ అనుమానం రాకుండా జాగ్రత్త పడటంలో తన రాజకీయ అనుభవాన్ని ఆసాంతం వాడేసుకున్నారు

కడియం శ్రీహరి. ఆ తర్వాత ఆయనే ఉప ముఖ్యమంత్రి అయ్యారు. అధిష్ఠానానికి తాటికొండ రాజయ్య, పసునూరి దయాకర్, ఆరూరి రమేశ్‌లకు మధ్యన గ్యాప్ పెంచడంలో సక్సెసయ్యారు.

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పోటీదారులను పక్కకుతప్పించి తన వారసురాలంటూ బిడ్డ కడియం కావ్యకు బీఆర్ఎస్ నుంచి వరంగల్ లోక్‌సభ సీటు ఇప్పించుకోవడం అందరికీ తెలిసిందే. ఈ ఎపిసోడ్‌లో కూడా పార్టీకి, అధిష్ఠానానికి మాత్రమే కాదు, లోకల్ క్యాడర్‌కు లీడర్‌కు కూడా తెలియనంత గోప్యత పాటిస్తూనే పోయి కాంగ్రెస్ కండువాను కప్పుకొన్నారు కడియం శ్రీహరి. కడియం కథ చూస్తుంటే పైన ఉన్న చిన్నయ్య సూరి పంచతంత్ర కథ గుర్తుకురాకుంటే మరేం గుర్తుకువస్తుంది. ఈ కథలో తల్లి కోతి కడియం అయితే పిల్లలు తాటికొండ రాజయ్య, పసునూరి దయాకర్, ఆరూరి రమేశ్‌లు.

'మనుమరాలు వయస్సులో ఉన్న అమ్మాయి మీద ఓడిపోయిన నువ్వా నాకు నీతులు చెప్పేది' అంటూ ఎర్రబెల్లి దయాకర్ రావు మీద విరుచుకుపడిన కడియం శ్రీహరి ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలి. పీసీసీ అధ్యక్షుడిగా, సుదీర్ఘకాలం మంత్రిగా, ముఖ్యమంత్రిగా పనిచేసి, జీవిత చరమాంకంలో గవర్నర్‌గా విధులు నిర్వహించిన దివంగత కొణిజేటి రోశయ్య కూడా 1994లో ఓడిపోయారు. ఆయన ఓడిపోయింది కూడా మనుమరాలు వయస్సున్న గోగినేని ఉమ మీద అన్న విషయం మరిచిపోకూడదు. తమకున్న రాజకీయ అనుభవంతో ముందుకుతీసుకుపోతారని కలలుగన్న సమాజాన్ని నట్టేట ముంచిన మీకు కాలమే తగినరీతిలో గుణపాఠం చెప్తుంది.